Estd. 1938
ఆంధ్రప్రభ
Journalism first!
తూర్పు గోదావరి
EAST GODAVARI
శుక్రవారం 27, ఏప్రిల్ 2018

# పాఠ్యాంశాలే కాదు... సామాజిక బాధ్యతను నేర్పించాలి

## ..ఏపిపిఎస్‌సి చైర్మన్ ఉదయ్‌భాస్కర్



**కాకినాడ సిటీ, ప్రభన్యూస్ :** విద్యార్థులకు పాఠ్యాంశాల్తో పాటు సామాజిక బాధ్యతను నేర్పించాలని ఎపిపిఎస్‌సి చైర్మన్ ప్రొఫెసర్ పి ఉదయ్‌భాస్కర్ అధ్యాపకులకు సూచించారు. ఇంజనీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎకోశాక్) ఆధ్వర్యంలో బీటెక్, బి.ఫార్మశీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో ఏపిపిఎస్‌సి చైర్మన్ ఉదయభాస్కర్ ముఖ్యఅతిధిగాను, ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.ఎస్. రామకృష్ణారావు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం, రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు, ఎకోశాక్ జనరల్ సెక్రటరీ ప్రొ.పి.సుబ్బారావు హాజరు కాగా ఎకోశాక్ ప్రెసిడెంట్ ప్రొ.జివిఆర్. ప్రసాదరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ అధ్యాపకులు కేవలం ఇంజనీరింగ్ పాఠ్యాంశాలను నేర్పించడమే కాకుండా సామాజిక బాధ్యతను నేర్పించాలని సూచించారు. నేటి ఆధునిక యుగంలో కనీస నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని, నైపుణ్యాల కొరతతో ఉన్నవారికి ఉద్యోగావకాశాలు దూరమవుతాయన్నారు. నాస్కామ్ సర్వేలో అనేక మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలు లేవని ప్రకటించారని, విద్యార్థులు ముందుగా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు 70శాతం మంది ఇంజనీర్లే దరఖాస్తు చేస్తున్నారని, సామాజిక బాధ్యత కలిగి, సేవ చేసే తత్వం కలిగిన వారే ప్రభుత్వ ఉద్యోగాలకు రావాలని, వారికే సమాజాన్ని మార్చే అవకాశం ఎంతో ఉంటుందన్నారు. ఇన్‌ఛార్జి విసి రామకృష్ణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఎక్కువగా ఉందని, ఆన్‌లైన్ ద్వారానే నేర్చుకోగల అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. దేశభక్తి కలిగి చేసే పనిపై ఆసక్తి, శ్రద్ధ, నిబద్ధత కలిగి తమ లక్ష్యాన్ని చేరుకునేలా శ్రమించాలన్నారు. పలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే పెట్రోలియం, ఫార్మశీ కోర్సులను మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, ప్రోగ్రాం డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎకోశాక్ సభ్యులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.